రైతులే రాష్ట్రానికి ప్రాణం

- తెలంగాణ అభివృద్ధికి సామాజిక న్యాయమే పునాది
- మహిళా సాధికారతే తెలంగాణ శక్తి
- అభివృద్ధి, సమృద్ధికి తెలంగాణ దిక్సూచి కావాలి
- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణ రైతులు ఈ రాష్ట్రానికి ప్రాణం లాంటివారు. వారి స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తుంది. మన ఆర్థిక వ్యవస్థను అది స్థిరపరుస్తున్నది. మన సాంప్రదాయాలను నిలబెడుతున్నది. వారిని ప్రోత్సహించి, ఉద్ధరించి, సాధికారత కల్పించడమే ప్రభుత్వ నైతిక కర్తవ్యం' అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. అందుకే రాష్ట్రంలో రూ.20,616.89 కోట్ల రూపాయలతో రైతులకున్న రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేశామని, దీని ద్వారా ఇప్పటి వరకూ 25.35 లక్షల మంది లబ్ది పొందారని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి సామాజిక న్యాయమే పునాది అని నొక్కి చెప్పారు. మహిళా సాధికారతే తెలంగాణ శక్తి అన్నారు. న్యాయబద్ధంగా పురోగతి సాధించడమే నిజమైన విజన్ అని నొక్కి చెప్పారు. బడ్జెట్ అంటే కేవలం ఆర్థిక కేటాయింపులు మాత్రమే కాదు..అది పటిష్ట, సుస్థిర తెలంగాణను రూపొందించడానికి, అభివృద్ధికి బాటలు వేసే రోడ్‌మ్యాప్ లాంటిదని వ్యాఖ్యానించారు. అభివృద్ధి, సమృద్ధికి తెలంగాణ దేశానికే దిక్సూచి కావాలని ఆకాంక్షించారు. డైనమిక్ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రత్యేక విజన్‌తో తెలంగాణ ముందుకెళ్తున్నదని కొనియాడారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం అసెంబ్లీకి ఆయన వచ్చారు. అసెంబ్లీలోకి సిఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులుతో పాటు పలువురు మంత్రులు గవర్నర్‌ను సాదరంగా ఆహ్వానించారు. శాసనసభ, శాసనమండలి సభ్యులనుద్దేశించి 35 నిమిషాల పాటు ఆయన ప్రసంగించారు.

తెలంగాణ గుర్తింపు వారసత్వాన్ని గౌరవిద్దాం

తెలంగాణ ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదనీ, భావోద్వేగాలకు, పోరాటాలకు, స్థిరత్వానికి, దృఢ సంకల్పానికి గుర్తుగా ఉందని జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక ఉద్దండులైన గద్దర్, గూడ అంజయ్య, బండి యాదగిరి, ఇతర ప్రముఖులను గౌరవిస్తోందన్నారు. తెలంగాణ గేయం 'జయ జయ జయహే తెలంగాణ' రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన పోరాటాలు, త్యాగాలను గౌరవించడమే కాకుండా ఐక్యమత్యానికి, స్థిరత్వానికి, సమిష్టి అభివృద్ధికి పిలుపునిస్తున్నదని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ఆత్మగౌరవానికి, సాధికారతకు చిహ్నంగా, పురోగమించే సమాజపు ఆకాంక్షకు ప్రతీకగా ఉందని కొనియాడారు.



శాసనసభ, శాసనమండలి సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న గవర్నర్

వరి ఉత్పత్తిలో తొలి స్థానం

వరి ఉత్పత్తిలో దేశంలోనే రికార్డు స్థాయిలో అత్యధికంగా 260 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించినందుకు గవ్నరర్ సంతోషం వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకం కింద రైతులకు ఏడాదికి రూ.12 వేల పెట్టుబడి సాయం అందిస్తున్న తీరును వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఏటా 12 వేల రూపాయలు ఇస్తున్నట్టు తెలిపారు. రైతులకు సాగులో ఉపయోగపడేలా అత్యాధునిక ఆడియో, వీడియో విజువల్‌ను సమకూరుస్తూ 566 రైతు వేదికలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

మహిళలకు సాధికారత, రక్షణ, సమాన అవకాశాలు

సమాజం పురోగతి సాధించాలంటే మహిళలకు సాధికారత, రక్షణ, సమాన అవకాశాలు అత్యావశ్యకమని గుర్తించి తమ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని గవర్నర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.5005.95 కోట్లు ఆదా అయ్యాయని, ఈ పథకం గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని కొనియాడారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం 50 లక్షల పేద కుటుంబాలకు ప్రయోజనకరంగా ఉందని చెప్పారు. రూ.500కే గ్యాస్ పథకం కింద 43 లక్షల కుటుంబాలకు మేలు జరుగుతున్నదని, ఆ కుటుంబాలు ఇప్పటి దాకా రూ.433.2 కోట్ల సబ్సిడీని పొందాయని వివరించారు.

క్రీడల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాం

యంగ్ ఇండియా యూనివర్శిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ) ద్వారా ప్రపంచంతో పోటీపడేలా యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తామని గవర్నర్ చెప్పారు. సివిల్ సర్వీస్‌కు ప్రిపేర్ అవుతున్న అర్హులైన పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సహకారమందించేందుకు రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం తీసుకొచ్చామని చెప్పారు. నిష్పక్షపాత, సత్వర, సమర్థమైన రిక్రూట్‌మెంట్ విధానాలతో గతేడాది కాలంలోనే 55 వేల మంది కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. క్రీడల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదనీ, ప్రపంచస్థాయి అథ్లెట్లను తయారు చేయడానికి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు బిల్లు ఆమోదం పొందిందని తెలిపారు. సమగ్ర స్పోర్ట్స్ పాలసీ రూపొందించామన్నారు. 36 క్రీడా విభాగాల్లో సీఎం కప్-2024ను నిర్వహించామనీ, 2.96 లక్షల మంది అథ్లెట్లు పాల్గొన్నారని తెలిపారు.

డైట్ చార్జీలు 40 శాతం, కాస్మెటిక్ 200 శాతం పెంచాం

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు డైట్‌చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచిన విషయాన్ని గవర్నర్ గుర్తుచేశారు. మెనూ చార్జీలను గణనీయంగా పెంచి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా అత్యున్నత విద్య అందించబోతున్నామని చెప్పారు. విద్యావ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకే అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, పర్యవేక్షణలో మహిళా సంఘాలు కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు.

ఆరోగ్యం ప్రాథమిక హక్కుగా విశ్వసిస్తున్నాం

ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ అనేది సదుపాయం మాత్రమే కాదనీ, పౌరుల ప్రాథమిక హక్కుగా తమ ప్రభుత్వం విశ్వసిస్తున్నదని గవర్నర్ తెలిపారు. ఆర్థికంతో సంబంధం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఆరోగ్యశ్రీ పథకం కింద కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. ఆరోగ్య శ్రీ కింద కొత్తగా 163 రకాల వైద్యసేవలను చేర్చామని తెలిపారు.

సామాజిక న్యాయం అభివృద్ధికి పునాది

సామాజిక న్యాయం తెలంగాణ అభివృద్ధి విధానానికి పునాదిగా ఉందని గవర్నర్ నొక్కి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే నిర్వహించామని తెలిపారు. ఆ సర్వే ద్వారా వచ్చిన సమగ్రమైన డేటాతో న్యాయబద్ధ, సమ్మిళిత సమాజాన్ని నిర్మించే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. రాజకీయ, సామాజిక అసమానతలను తొలగించడంలో ఈ సర్వే దోహదపడుతుందని ఆకాంక్షించారు. ఆ సర్వే ఆధారంగానే సామాజిక న్యాయం అందించే దిశగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం బిల్లును ప్రతిపాదించామన్నారు.

ఐటి, ఎలక్ట్రానిక్స్ ఆవిష్కరణల్లో తెలంగాణ అగ్రగామి

ప్రపంచ పెట్టుబడుదారులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాలు కల్పించడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధాన్ని సులభతరం చేయడం వంటి అంశాలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నొక్కి చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఇ)పై ప్రత్యేక దృష్టి సారించామని, వాటి కోసం ప్రత్యేక ఎకో సిస్టమ్‌ను తీసుకురాబోతున్నామని తెలిపారు. వాటికి అనుబంధంగా ఫార్మాసూటికల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, పునరుత్పాదక ఇంధనం, ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరమ్‌లో పాల్గొనడం ద్వారా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామనీ, వాటి ద్వారా 49,500 మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని వివరించారు.

తెలంగాణను పర్యాటక గమ్య స్థానంగా మారుస్తాం

తెలంగాణను పర్యాటక గమ్యస్థానంగా రూపొందించడానికి చాలా అవకాశాలున్నాయని గవర్నర్ తెలిపారు. పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేసి ఎకో, హెరిటేజ్, అడ్వెంచర్ టూరిజాలను ప్రోత్సహిస్తామన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి పాలసీ రూపొందించామని తెలిపారు. ప్రయివేటు భాగస్వాములతో ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు. టెంపుల్, ట్రైబల్, వెల్‌నెస్ టూరిజాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఆధ్యాత్మిక, చారిత్రక, సహజ అందాల విశిష్ట మేళవింపును పర్యాటకులకు అందిస్తామన్నారు. 2025-స్వచ్ఛ, హరిత ఇంధన పాలసీ ఇంధన భద్రతకు, స్థిరత్వానికి ప్రాధాన్యత ఇస్తుందనీ, రాబోయే దశాబ్దంలో సౌర, పవన, ఇంధన నిల్వలను పెంచడం కోసం ప్రణాళిక రూపొందించామని గవర్నర్ తెలిపారు.

తెలంగాణ నిర్మాణానికి కలిసి ముందుకు సాగుదాం

మెట్రో రైల్ విస్తరణ, మూసీ నది పునర్జీవన ప్రాజెక్టు, ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో పట్టణ జీవితం మరింత మెరుగవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దడానికి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం యోచిస్తున్నదని తెలిపారు. ఏఐ, హైటెక్ పరిశ్రమలలో తెలంగాణను అగ్రగామిగా చేయడం తమ లక్ష్యమన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, సమ్మిళిత పాలన పట్ల మనకున్న అచంచల అంకిత భావమే అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు మూలస్తంభంగా ఉండి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి దేశానికి ఆదర్శ రాష్ట్రంగా ఉండేలా ముందుకెళ్తున్నామని నొక్కి చెప్పారు. తెలంగాణ నిర్మాణానికి సంఘటితంగా, విశ్వాసంతో, స్థిరమైన నిబద్ధతతో అందరం కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. జైహింద్..జై భారత్..జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

బడి నుంచే స్త్రీలను గౌరవించాలి

- మహిళా, శిశుసంక్షేమ మంత్రి సీతక్క
- ఆటంకాలను ఛాలెంజ్‌గా తీసుకుని ముందుకెళ్లాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్త్రీలను గౌరవించడం అనేది "అమ్మ ఒడి, చదువుకునే బడి" నుంచే ప్రారంభం కావాలని పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ మంత్రి డా.దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్ ఓయు ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహించిన "ప్రమోటింగ్ విమెన్ రైట్స్, జెండర్ ఈక్వాలిటీ, ఫాస్టరింగ్ ఎంపవర్‌మెంట్" అంశంపై ఒక రోజు జాతీయ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. సి.కాశీం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం విద్యారంగంలోనే కాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. నిరంతరం సమాజం కోసం పాటుపడాలనే లక్ష్యమే ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని, తాను అదే నమ్ముతానని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని మాట్లాడుతూ.. మగవారితో పోలిస్తే మహిళలకు విజయాన్ని సాధించడంలో అనేక ఆటంకాలు వస్తాయని తెలిపారు. అయితే, వాటిని ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. తాను ఒక మహిళగా అన్ని బాధ్యతలూ నెరవేరుస్తూనే, అనేక విజయాలు అందుకున్నానని తెలిపారు. మహిళలకు కుటుంబాల అండ లభిస్తే ఎంతటి లక్ష్యాన్నైనా సాధిస్తారన్నారు. ఓయు విసి ఎం.కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ వినడం, రాయడం, మాట్లాడటం అనే నైపుణ్యాలను అలవర్చుకొని, విద్య, ఉపాధి రంగాల్లో కృషి చేయాలని సూచించారు. ఓయూ విద్యార్థుల కోసం సాధ్యమైనన్ని సదుపాయాలు కల్పించడం కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. అనంతరం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొ.శ్రీరాం వెంకటేశ్, ఓయూ ఆర్ట్స్ డీన్ ప్రొ. సయిదా తలత్ సుల్తానా, సామాజిక శాస్త్రాల డీన్ ప్రొ. సి.అరుణ జ్యోతి, ఐసిఎస్ఎస్ఆర్ ఓయూ డైరెక్టర్ ప్రొ.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్ ప్రసంగం.. కౌశిక్ అరుపులు

- జతకలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం అసాంతం బిఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి అరుస్తూ, సిఎం చైర్, కాంగ్రెస్ సభ్యుల వైపు చూస్తూ చేతులతో సైగలు చేయడం కనిపించింది. ఆయనతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 'సేమ్.. సేమ్.. సిగ్గు.. సిగ్గు.. ఫేక్.. ఫేక్.. ఫాల్స్.. ఫాల్స్..' అంటూ అరవడం కనిపించింది. అయితే, వారిని పట్టించుకోకుండా తన స్వరాన్ని పెంచి గవర్నర్ ప్రసంగించారు. ప్రారంభంలో కెటిఆర్, జగదీశ్‌రెడ్డి బిఆర్ఎస్ సభ్యుల చైర్ల దగ్గరకు వెళ్లి ఏదో చెప్పి వచ్చారు. అప్పటి నుంచి కంటిన్యూగా ఆ పార్టీ సభ్యుల్లో ఎవరో ఒకరు రన్నింగ్ కామెంట్ చేస్తూనే కనిపించారు. రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు రూ. రెండు లక్షల లోపు రుణమాఫీ చేశామని గవర్నర్ చదువుతుండగా... ఫాల్స్.. ఫాల్స్ అని కౌశిక్‌రెడ్డి నినదించారు. 'ఆడియో, విజువల్ మీడియా సమకూర్చి 566 రైతు వేదికలను ఏర్పాటు చేశాం' అని చెబుతుంటే..'మీరు చేయలేదు.. కెసిఆర్ చేశారు' అంటూ కౌశిక్‌రెడ్డి అరిచారు. సన్నరకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చొప్పున మొత్తం 1,206 కోట్లు ఇచ్చామని గవర్నర్ చెప్పే సమయంలో... 'బోనస్.. బోగస్' అని బిఆర్ఎస్ సభ్యులు నినదించారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకంపై గవర్నర్ మాట్లాడే సమయంలో 'నిరుద్యోగ భృతి ఏమాయే?' అంటూ కౌశిక్‌రెడ్డి అరిచారు. రాష్ట్రంలో గతేడాది 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చామని గవర్నర్ చదువుతున్న సమయంలో....'అంతా ఫేక్..కేసీఆర్ ఇచ్చిండు..మీ ఖాతాలో వేసుకున్నారు..' అని మరోమారు చేతులతో సైగలు చేస్తూ అరిచారు. హరీశ్‌రావు, గంగుల కమలాకర్ వారించినా కౌశిక్‌రెడ్డి మాత్రం వెనక్కి తగ్గలేదు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో రక్షక్ సెక్యూరిటాస్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ కింద పనిచేస్తున్న సుమారు 50 మంది కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు, బోనస్ ఇవ్వాలని హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఎం వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ డిఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కాంట్రాక్టర్ వేతనాలు, బోనస్ ఇవ్వకపోతే యాజమాన్యమే ఇవ్వాలని 2024 అక్టోబర్ 7న రీజనల్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డైరెక్షన్ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ రైల్వే యాజమాన్యం, కాంట్రాక్టర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు నెలల వేతనాలు, 2 సంవత్సరాల బోనస్ కార్మికులకు ఇవ్వలేదని చెప్పారు. అడిగిన ప్రతిసారీ వాయిదాలు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ నాలుగు నెలల వేతనాలు ఇప్పటివరకు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులంటే కాంట్రాక్టర్లకు, రైల్వే యాజమాన్యానికి పట్టింపు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెలా 7లోపు వేతనాలు ఇవ్వని, పేస్లిప్పులు, ఇఎస్ఐ, పిఎఫ్ తదితర హక్కులు అమలు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. రక్షక్ సెక్యూరిటాస్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థను కూడా బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు.

సభలో సమన్వయంతో వ్యవహరించాలి

- సబ్జెక్టుల వారీగా బాధ్యతలు తీసుకుని మాట్లాడాలి
- ప్రతిపక్షాలకు ధీటుగా సమాధానం చెప్పాలి
- సిఎల్‌పి సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

శాసనసభలో సమన్వయంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికార పార్టీ సభ్యులను దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పాలని ఆయన సూచించారు. అందుకోసం సబ్జెక్టుల వారీగా పని విభజన చేసుకోవాలనీ, దానికి అనుగుణంగా స్పందించాలన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సిఎల్‌పి) సమావేశంలో రేవంత్ మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రతిపక్షాలు గందరగోళం చేసే ప్రయత్నం చేస్తాయనీ, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలని చెప్పారు. అత్యంత కీలకమైనవిగా గుర్తించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లో ప్రజాప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశముందని అన్నారు. అందువల్ల సభ్యులందరూ కచ్చితంగా సభకు రావాల్సిందేనన్నారు. అంశాల వారీగా ప్రిపేర్ అయి సభకు రావాలని తెలిపారు. హాజరుపై ప్రభుత్వ విప్‌లు పర్యవేక్షించాలని ఆదేశించారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. హాజరైతేనే సభలో ఏం జరుగుతుందో తెలుస్తుందనీ, సోషల్ మీడియాలో ఎమ్మెల్యేలు యాక్టివ్‌గా ఉండాలని కోరారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో సమావేశమవుతానని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ఎమ్మెల్యేలు, విప్‌లపై సిఎం సీరియస్

ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిఈ సందర్భంగా సీరియస్ అయ్యారు. శాసనసభలో ప్రతిపక్షాలను ఎదుర్కొనే విషయంలో నిర్లక్ష్య వైఖరిపై ఆయన వారికి క్లాస్ తీసుకున్నట్టు తెలిసింది. గవర్నర్ ప్రసంగం తర్వాత సిఎం ఛాంబర్‌కు వెళ్లిన ఎమ్మెల్యేలు, విప్‌లు సిఎం ఆగ్రహానికి గురయినట్టు వినికిడి. గవర్నర్ ప్రసంగం సందర్భంగా బిఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తుంటే మీరేం చేస్తున్నారు? మనం లిక్కర్ పాలసీ తెచ్చాం. ఆ పార్టీ పాలసీ లేకుండా వ్యవహరించింది. ద్వారా వెనకేసుకున్నారు. ఈ విషయాన్ని శాసనసభలో ఎండగట్టాలని అని రేవంత్ సూచించారు. ప్రభుత్వ విప్‌లు పని తీరు మార్చుకోవాలనీ, సభ్యులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలనీ, అందరూ అన్ని విషయాలు మాట్లాడాలనుకోకండి. ఒక్కొక్కరు ఒక్కో విషయాన్ని ఎంపిక చేసుకోండి. ఫ్లోర్ కో ఆర్డినేషన్ పకడ్బందీగా చేయండి' అని సూచించారు. ఈ సందర్భంగా బయటకు వెళ్లిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిపై సిఎం అసహనం వ్యక్తం చేశారు.

ఫిలిప్స్‌తో మెడ్‌ట్రానిక్స్ భాగస్వామ్యం

హైదరాబాద్: వైద్య సాంకేతికతలో అగ్రగామి అయిన మెడ్‌ట్రానిక్ తాజాగా ఆరోగ్య సాంకేతికత సంస్థ ఫిలిప్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. స్ట్రక్చరల్ హార్ట్ డిసీజెస్ కోసం అధునాతన ఇమేజింగ్ టెక్నిక్‌లపై కార్డియాలజిస్టులు, రేడియాలజిస్టులకు అవగాహన కల్పించడానికి, శిక్షణ ఇవ్వడానికి ఒప్పందంపై సంతకం చేసినట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. ముఖ్యంగా ఎండ్-స్టేజ్ రీనల్ డిసీజ్ (ఇఎస్ఆర్‌డి) రోగులకు సేవలందించడంలో ఎకోకార్డియోగ్రఫీ (ఎకో), మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ) వంటి మల్టీ మోడాలిటీ ఇమేజింగ్‌లో 300 మందికి పైగా వైద్యుల నైపుణ్యాన్ని పెంచడాన్ని ఈ భాగస్వామ్యం లక్ష్యమని మెడ్‌ట్రానిక్ ఇండియా ఎండి మన్దీప్ సింగ్ కుమార్ పేర్కొన్నారు.

ప్రవాస మహిళల కోసం బిఒబి స్పెషల్ సేవింగ్ ఖాతా

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగా బిఒబి గ్లోబల్ వుమెన్ ఎన్ఆర్ఇ అండ్ ఎన్ఆర్ఒ సేవింగ్స్ ఖాతాను ఆవిష్కరించినట్లు తెలిపింది. దీన్ని ప్రత్యేకంగా ప్రవాస మహిళల కోసం డిజైన్ చేసినట్లు వెల్లడించింది. ఎన్ఆర్ఐలు తమ గ్లోబల్ అవకాశాలు, బ్యాంకింగ్ అవసరాలను తీర్చుకోవడానికి వీలుగా ఉంటుందని పేర్కొంది. ఇందులో ప్రీమియం ఎన్ఆర్ఇ, ఎన్ఆర్ఒ సేవింగ్ ఖాతా ద్వారా ప్రత్యేక ఫీచర్లు, బెనిఫిట్లు పొందవచ్చని బిఒబి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బినా వహీద్ పేర్కొన్నారు. ఈ సేవింగ్ ఖాతాతో గ్లోబల్ ఇండియన్ మహిళలు ప్రత్యేక ప్రీమియం బ్యాంకింగ్ సేవలను పొందవచ్చున్నారు. లాకర్ అద్దెలో 100 శాతం రాయితీ, రూ.50 లక్షల విలువ చేసే విమానయాన ఉచిత యాక్సిడెంట్ బీమా, రూ.5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా, మరిన్ని లాభాలు పొందవచ్చన్నారు. నివాస, వాహన రుణాలపై తక్కువ వడ్డీ రేట్లను అందిపుచ్చుకోవచ్చన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ ఫ్యామిలీ జడ్జ్, చెన్నై
H.M.O.P.No. 82 OF 2024
రేష్మా బేతాళ, భర్త **చేతన్ బేతాళ,**
తండ్రి శ్రీ ఎం.సంతోష్ కుమార్ లుంకర్,
బ్లాక్. 3, 5ఎ ఇండస్ అంబర్,
అపార్ట్‌మెంట్ నెం.73, వెస్ట్ జోన్స్, వెస్ట్ సైదాపేట,
చెన్నై-600015. - పిటీషనర్
వర్సెస్
చేతన్ బేతాళ - రెస్పాండెంట్
ప్రతివాదికి నోటీసు
చేతన్ బేతాళ, తండ్రి **భూపాల్‌రాజ్ బేతాళ,**
ప్లాట్ నెం.16, భావన ఎన్‌క్లేవ్ ఫేస్ 1,
న్యూ భోవన్‌పల్లి, తిరుమలగిరి, హైదరాబాద్,
ఆంధ్రప్రదేశ్-500011.
పై నెంబరు కేసులో పిటిషనరు మీ మీద పై వారి కోర్టులో విడాకులు కోరుతూ పిటిషన్ దాఖలు చేసియున్నారు. ప్రిన్సిపల్ ఫ్యామిలీ జడ్జ్, మెద్రాస్ కోర్టులో దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే28-03-2025ది** ఆ రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీ స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మిమ్మలను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
రేష్మా బేతాలా
పార్టీ ఇన్ పర్సన్

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY SMALL CAUSES COURT-CITY CIVIL COURT AT :: HYDERABAD
MA No. 114 OF 2024
Between:
Annam Sunanda and others ...Appellants
And
Greater Hyderabad Municipal Corporation, Represented by its Commissioner others ...Respondents
To: Respondent No.3
Sangam Uma Rani D/o. Late Nandam W/o. S. Surender, Age: 58 Years, Occ: Housewife, R/o. H.No. 3-3-80/12/A, Yerraboda, Opp: Venkateswara Swamy Temple, Hyderguda, Attapur, Hyderabad -48.
NOTICE
The Appellants have filed a Memorandum of Appeal filed U/s 654 & 655 of Greater Hyderabad Municipal Corporation Act, 1955 against you and others, where in you are the Respondent No.3, the said case is posted to 25-03-2025 at 10.30 a.m. For your appearance personally or through an advocate in the above said court, failing which, the matter will be decided on merits.
(BY ORDER OF THE COURT)
KOTHA JANARDHAN REDDY
ADVOCATE
7-290/1, KJR Residency Karmanghat, Shakthinagar, Near TKR Kaman, Hyderabad-97.

వాస్తవాలకు భిన్నంగా గవర్నర్ ప్రసంగం

- ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వం కొనసాగించేలా ఉంది
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేసిన ప్రసంగం వాస్తవాలకు భిన్నంగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించే విధంగా ఉన్నదని భావిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు గ్యారెంటీల్లో మొదటిది మహిళలకు రూ.2500 అమలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, దళిత కుటుంబానికి రూ.12 లక్షలు, ఇల్లులేని పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి హామీలు ఈ ఏడాది కూడా అమలు కాని పరిస్థితి కనపడుతున్నదని తెలిపారు. ఈ ప్రసంగంలో రెండు లక్షల ఉద్యోగాల ప్రస్తావన లేదని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ పూర్తికాలేదని వివరించారు. విద్యా, వైద్యానికి రంగాల అభివృద్ధిపై స్పష్టత లేదని తెలిపారు. రాష్ట్రంలో గత దశాబ్ధ కాలంగా 15 వేల పరిశ్రమలు మూతపడ్డాయని పేర్కొన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి పెడదామనీ, గతేడాది నుంచి కేంద్రం, రాష్ట్రం చెపుతున్నప్పటికీ అందుకు తగ్గ చర్యల్లేవని తెలిపారు. 13 లక్షల మంది రైతులు పాసు పుస్తకాల కోసం ఎదురుచూస్తున్నారనీ, భూ సమస్యల పరిష్కార అంశం వివరించలేదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా, విభజన చట్టం అమలు, ఇచ్చిన హామీల అమలుపై కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేకపోయినా బీజేపీ ప్రభుత్వ వైఖరిపై గవర్నర్ ప్రసంగంలో ఎలాంటి ప్రస్తావన లేదని విమర్శించారు.

ధరణిని భూమాతగా పేరు మార్చినా భూ సమస్యలు పరిష్కారం కాలేదని జాన్‌వెస్లీ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ పేరుతో పెద్దఎత్తున మాయాజాలాన్ని సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. దావోస్ పర్యటన ద్వారా రూ.1.70 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వస్తాయని చెప్తున్నారని తెలిపారు. వాస్తవానికి ఫ్యూచర్ సిటీ పరిధిలోని రైతుల భూములన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించి, రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా రూ.కోట్లు సంపాదించేట్టుగా ఉన్నదని వివరించారు. వారి భూములను ఆక్రమిస్తుంటే పెట్రోల్ పోసుకుని కలెక్టర్ కార్యాలయం ముందు రైతు ఆత్మహత్యాయత్నం వంటి ఘటనలు రైతుల వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. అందుకే అబ్దుల్ కలాం గురించి చెప్తూ 'కలలు కనండి, అవి ఆలోచనలుగా మారుతాయి. అవి కార్యాచరణగా మారుతాయి'అని చెప్పి ముగింపు చేశారని వివరించారు. కానీ రాష్ట్రంలో పాలన చూస్తే కలలు కలలుగానే మిగిలిపోయే పరిస్థితి ఉంది తప్ప, శ్రామిక వర్గాలకు, సామాజిక తరగతులకు న్యాయం, అభివృద్ధి జరుగుతుందనే స్పష్టత గవర్నర్ ప్రసంగంలో లేదని విమర్శించారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంలోనైనా ఈ అంశాలనిటినీ పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్ ప్రతిపాదనలను చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

19న రాష్ట్ర బడ్జెట్

- 27 వరకు అసెంబ్లీ సమావేశాలు
- బిఎసి సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను 11 రోజులపాటు నిర్వహించాలని బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బిఎసి) నిర్ణయించింది. కనీసం 20 రోజులు నిర్వహించాలని ప్రతిపక్షాలు పట్టు పట్టాయి. అయితే 27న మరోసారి బిఎసి సమావేశమై నిర్ణయం తీసుకుందామని అధికార పక్షం సూచించింది. ప్రభుత్వ వైఖరిని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. ప్రజా సమస్యలపై చర్చించేందుకు పనిదినాలను పొడిగించాలని కోరాయి. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బిఎసి సమావేశమైంది. సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు. ఈ నెల 27 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. 19న ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. 14న హోలీ పండుగ, 16న ఆదివారం సెలవు దినాలుగా ప్రకటించారు. 17న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై చర్చించనున్నారు. 18న బీసీ కులగణన, రిజర్వేషన్లపై చర్చ జరుగనుంది. 21న బడ్జెట్‌పై చర్చను ప్రారంభిస్తారు. మూడు రోజుల పాటు పద్దులపై చర్చ జరుగనుంది. 27న ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలపనుంది. అయితే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు తొలిరోజు హాజరైన ప్రతిపక్ష నేత కేసీఆర్...ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించిన వెంటనే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కీలకమైన బీఏసీ సమావేశానికి హాజరు కావాల్సిన ఆయన ముఖం చాటేశారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక కేసీఆర్ కేవలం మూడే సార్లు అసెంబ్లీకి హాజరయ్యారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఒకసారి...గత ఏడాది బడ్జెట్ సందర్భంగా మరోసారి హాజరైన కేసీఆర్.. ఇప్పుడు బడ్జెట్ సందర్భంగా హాజరయ్యారు.

సహకరించకపోతే జీతాలిచ్చే పరిస్థితిలేదు

- ప్రభుత్వ విద్యాసంస్థల కంటే ప్రయివేటువి గొప్పవా?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



విలకాంగుడైన ఉపాధ్యాయునికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న సిఎం రేవంత్ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రాష్ట్రంలో కొన్ని సమస్యలున్నాయి. సమస్యల గురించి చర్చించుకుంటూ పోతే అవి పరిష్కారం కాలేదనే పేరుతో ప్రభుత్వానికి సహకరించబోమని ఉద్యోగులు అనుకుంటే మన పరిస్థితి ఇంకా దిగజారి పోతుంది. రాష్ట్రం మరింత దివాళా తీస్తుంది. నెలనెలా జీతాభత్యాలు ఇవ్వలేని పరిస్థితికి పడిపోతాం. ప్రభుత్వ ఉద్యోగులకు 2024, జనవరి నుంచి ప్రతినెలా ఒకటో తారీఖున జీతాలిస్తున్నాం. ఈనెల ఇబ్బంది వస్తే ఆర్బీఐ వద్దకెళ్లి రూ.నాలుగు వేల కోట్లు తెచ్చి ఇచ్చాను. డిఎ ఇతర అంశాలున్నాయి. ఈ ప్రభుత్వం మీది. నేను కస్టోడియన్‌ను మాత్రమే. సమన్వయం మాత్రమే చేస్తా. అందుకే ప్రభుత్వ ఉద్యోగ మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నా. పైసా పైసా లెక్క మొత్తం మీకే అప్పజెప్తా. ఏది ఎలా పంచాలో మీరే చెప్పండి. నా దగ్గర ఏమీ ఉంచుకోను. ఒక్క పైసా కూడా నా దగ్గర నా జేబులో పెట్టుకోను. నా నెల జీతం కూడా మీకే ఇస్తా. ఎలా పంచాలో మీరే చెప్పండి.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 1,532 మంది అధ్యాపకులకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపికైన అధ్యాపకులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవాళ ఉద్యోగ నియామక పత్రాలను అందుకుంటున్న అధ్యాపకులందరికీ అభినందనలు చెప్పారు. కెసిఆర్ కుటుంబ ఉద్యోగాలను ఊడగొడితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయంటూ ఎన్నికల్లో తాను చెప్పానని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో నిరుద్యోగుల కృషి, పట్టుదల ఉందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 12 ఏళ్లు వృథా అయ్యిందని అన్నారు. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 57,946 ఉద్యోగాలను భర్తీ చేశామని, ఆ సంతృప్తి ఉందని వివరించారు. ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలిచ్చిన రాష్ట్రం ఉందా?అని ప్రశ్నించారు.

కేరళతోపాటు తెలంగాణ అభివృద్ధి కావాలి

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ ఆర్థిక భవిష్యత్ విద్యాశాఖతో ముడిపడి ఉందని చెప్పారు. అలాంటి శాఖలో ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడం గొప్పవిషయమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను గొప్పగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యాశాఖకు రూ.21,621 కోట్లు కేటాయించామని వివరించారు. 55 రోజుల్లోనే ఉపాధ్యాయ నియామకాలను పూర్తి చేశామన్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సమస్యను పరిష్కరించి విద్యాశాఖను ప్రక్షాళన చేశామని అన్నారు. ప్రభుత్వ బడుల కంటే ప్రయివేటు స్కూళ్లు గొప్పవా? అని ప్రశ్నించారు. కానీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రమాణాలు పడిపోవడం ఆందోళన కలిగించే విషయమని, ఇది తెలంగాణకు అవమానకరమని అన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోందని, తల్లిదండ్రుల్లో విశ్వాసం ఉండడం లేదని చెప్పారు. ఎక్కడ లోపం ఉందో ఆలోచించాలని, మూలాలను పరిశీలించాలని సూచించారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదనీ, వారి భవిష్యత్‌కు పెట్టుబడి అని వివరించారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు భావోద్వేగంతో ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు, కళాశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. పిల్లల బాధ్యతను ఉపాధ్యాయులు, అధ్యాపకులు చూసుకోవాలని కోరారు. సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదని చెప్పారు.

ప్రపంచంతో పోటీ పడాలి

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాప్రమాణాలను పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించబోతున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా సమీకృత గురుకులాల కోసం రూ.11 వేల కోట్లు కేటాయించామని వివరించారు. విద్యార్థులు, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామన్నారు. విద్యార్థులకు నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం లేకుంటే ఉద్యోగాలు రాబోవని స్పష్టం చేశారు. చదువుతోపాటు నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఉండాలన్నారు. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రికెట్‌లో రాణించిన సిరాజ్ కోసం నిబంధనలను సడలించి ఉద్యోగమిచ్చామనీ, బాక్సింగ్‌లో రాణించిన నిఖత్ జరీన్‌కు డిఎస్‌పి ఉద్యోగం ఇచ్చామని, పారాలింపిక్స్‌లో రాణించిన దీప్తి జీవాంజీకి ఇంటి స్థలంతోపాటు ఉద్యోగం ఇచ్చామని గుర్తు చేశారు.

స్ట్రేచర్ నుంచి స్ట్రెచర్‌కు పరిమితం

కొంతమంది స్టేచర్ గురించి అని మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. స్టేచర్ ఉందని విర్రవీగినవారు స్ట్రెచర్ మీదకు వెళ్లారనీ, (పరోక్షంగా కెసిఆర్‌నుద్దేశించి) తర్వాత మార్చురీకి పోతారని చెప్పారు. స్టేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండబోదని స్పష్టం చేశారు. తమకు కెసిఆర్ వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమేనని అన్నారు. రాష్ట్రానికి ప్రతినెలా ఆదాయం రూ.18 వేల కోట్లు వస్తుందన్నారు. అందులో ఉద్యోగుల జీతభత్యాలకు రూ.6,500 కోట్లు, కేసీఆర్ చేసిన అప్పులు, వడ్డీలకు రూ.6,500 కోట్లు ప్రతినెలా చెల్లించాలని వివరించారు. మిగిలిన రూ.ఐదు వేల కోట్లతో తాము ఇచ్చిన హామీలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేయాలన్నారు. రాష్ట్రానికి కెసిఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారని ఆరోపించారు. వాస్తవాలు చెప్తే రాష్ట్రం దివాళా తీసిందంటూ బిఆర్ఎస్ నాయకులంటున్నారని చెప్పారు. రూ.22 వేల కోట్ల ఆదాయం వస్తే ఇచ్చిన హామీలతోపాటు పెండింగ్ బకాయిలు చెల్లించడానికి వీలవుతుందన్నారు. కెసిఆర్ కుటుంబం మొత్తం అబద్ధాలు మాట్లాడుతున్నదని అన్నారు. అబద్ధాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపబోనని చెప్పారు. వాస్తవాలను చెప్పి రాష్ట్రాభివృద్ధికి తాను కృషి చేస్తానని వివరించారు. భావితరాల భవిష్యత్ నిర్మాణానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు పునరంకితం కావాలని కోరారు. దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలపాలని విజ్ఞప్తి చేశారు.

విద్యావ్యవస్థ మార్పు కోసం చర్యలు తీసుకుంటున్నాం : పొన్నం

రాష్ట్రంలో విద్యావ్యవస్థ మార్పు కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పదేళ్లపాటు విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఉద్యోగాలను భర్తీ చేయలేదని, సకాలంలో విసిలను నియామించలేదని చెప్పారు. ఇటీవలే విసిలను నియమించామని గుర్తు చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పేరుతో ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని వివరించారు.

వెనుకబడిన ప్రాంతాలకు చెందిన వారికి కొలువులు : సిఎస్ శాంతికుమారి

రాష్ట్రంలో ఇంటర్ విద్యకు సంబంధించి పురుషులు 794 మంది, మహిళలు 498 మంది కలిపి 1,292 మంది జూనియర్ లెక్చరర్లు, పాలిటెక్నిక్ కాలేజీలకు సంబంధించి పురుషులు 177 మంది, మహిళలు 63 మంది కలిపి 240 మంది అధ్యాపకులు కలిపి మొత్తం 1,532 మంది నియామక పత్రాలను అందుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) శాంతికుమారి చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలకు చెందిన వారు అధ్యాపక కొలువులకు ఎంపికయ్యారని వివరించారు. ఆసిఫాబాద్, మహబూబాబాద్, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో మారుమూల ప్రాంతాలకు చెందిన వారు ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఇది ఎంతో సంతోషకరమని అన్నారు. నూతన ప్రభుత్వం 57,946 ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కె కేశవరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, మీర్జా రెహమత్ బేగ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రీహరి, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలో పోలీసులతో మాట్లాడుతున్న రైతులు

ప్రాణాలైనా ఇస్తాం.. భూములు మాత్రం ఇవ్వం

- నిమ్జ్ పేరుతో మా జీవనాధారాన్ని లాగేసుకోవద్దు
- భూ సేకరణ గ్రామసభలో రైతుల ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ప్రాణాలైనా ఇస్తాం కానీ.. జీవనాధారంగా ఉన్న భూములను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వలేమని, నిమ్జ్ పేరుతో అధికారులు బలవంతపు భూసేకరణ వెంటనే ఆపేయాలని సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండంలోని మామిడ్గి రైతులు అధికారులకు స్పష్టం చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. నిమ్జ్ ప్రాజెక్టు భూ సేకరణలో భాగంగా నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు, తహసీల్దార్ భూపాల్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మామిడ్గి రైతు వేదికలో బుధవారం గ్రామసభ చేపట్టి రైతుల అభిప్రాయాలను సేకరించారు. అయితే నిమ్జ్ భూముల బలవంతపు సేకరణ ఆపాలంటూ వందల సంఖ్యలో రైతులు తరలివచ్చారు. దాంతో గ్రామసభ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా మామిడ్గి భూ నిర్వాసితులు రాజిరెడ్డి, సంతోష్, జగన్నాథ్‌రెడ్డి, నాగప్ప పలువురు రైతులు గ్రామసభలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మంచి సారవంతమైన పట్టా, అసైన్‌మెంట్ భూములు దాదాపు వెయ్యి ఎకరాలు నిమ్జ్ పరిధిలో ఉన్నాయని, వాటిల్లో ఏడాదికి మూడు రకాల ప్రధాన పంటలు పండుతాయని తెలిపారు. అలాంటి భూములను తీసుకోవద్దంటూ విజ్ఞప్తి చేశారు. నిమ్జ్ రిజిస్ట్రేషన్ యథావిధిగా చేయాలని, బ్యాంకులు క్రాప్‌లోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా గ్రామ సభ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జహీరాబాద్ డిఎస్‌పి రామ్మోహన్ రెడ్డి పర్యవేక్షణలో ఇద్దరు సిఐలు జక్కుల హనుమంతు, శివలింగం, ఎస్ఐలు రాజశేఖర్ హద్నూర్, ఝరా సంఘం, ప్రత్యేక పోలీస్ బలగాలు 50 మందితో గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.

జరగబోయే ప్రమాదంపై చర్చిద్దాం రండి

- రాజకీయ పార్టీలకు భట్టి, జానారెడ్డి బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి బహిరంగ లేఖ రాశారు. జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలూ హాజరు కావాలని ఆ లేఖలో కోరారు. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని తెలిపారు. త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.

ప్రతిభావంత కవి రాము : జస్టిజ్ చంద్ర కుమార్

ప్రజాశక్తి - కల్చరల్

ఉభయ తెలుగు రాష్ట్రాలలో రాము రాసిన పాటల సంఖ్య తో పోల్చితే వేరెవరూ రాయలేదని రాష్ట్ర హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. రాము లలిత గీతాలలో ప్రేమతో పాటు సామాజిక చింతన వుంటుందని అయన ప్రతిభావంత కవి అని కొనియాడారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై రసమయి సంస్థ నిర్వహణలో విఖ్యాత కవి డాక్టర్ ఎంకె రాము జన్మదిన వేడుక లలిత గీతానికి పట్టాభిషేకం పేరిట జరిగింది. లిటిల్ మ్యూజిషియన్స్ అకాడెమీ రామా చారి శిష్య బృందం సురేఖ ,శశి కళ తదితరులు రాము రచించిన గీతాలు మధురంగా గానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్ర కుమార్ రామును అభినందిస్తూ మాట్లాడారు కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణు గోపాలాచారి మాట్లాడుతూ రాము సినీ గీతాలు నృత్య నాటికలు రాసి ప్రజల హృదయలను కదిలించారని అన్నారు. అధ్యక్షత వహించిన ఆదాయ పన్నుల శాఖ పూర్వ పూర్వ కమిషనర్ నరసింహాప్ప మాట్లాడుతూ నాడు నందమూరి తారక రామరావు ప్రసంగాలు రాము పై ప్రభావం చూపాయి అని వివరించారు. రామును నేటి నిజం సంపాదకుడు బైశ దేవదాసు సంగీత స్వర కర్త పివి సాయి బాబా అభినందించారు

ప్రత్యేక ఆకర్షణగా తండ్రి.. కొడుకు.. కూతురు

- సైలెంట్‌గా గవర్నర్ ప్రసంగ కాపీ చదువుకున్న కెసిఆర్
- అధినేతకు బిఆర్ఎస్ సభ్యుల ఘనస్వాగతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్షనేత కె చంద్రశేఖర్‌రావు, ఆయన కుమారుడు కె తారకరామారావు, కుమార్తె కె కవిత.. బుధవారం ఒకేసారి శాసనసభలోకి అడుగుపెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 10:55 నిమిషాలకు కెసిఆర్ సభలో అడుగు పెట్టగా.. ఆయన వెనకాలే బిఆర్ఎస్ సభ్యులంతా వచ్చారు. కెసిఆర్ ముందువరుసలో తన చైర్‌లో ఆశీనులు కాగా..సబితా ఇంద్రారెడ్డి పక్కన కెటిఆర్.. చివరి నుంచి రెండో వరుసలో కవిత కూర్చున్నారు. ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఓవైపు ప్రసంగం చేస్తుండగా.. కెసిఆర్ తన సీట్లో కూర్చొని గవర్నర్ ప్రసంగ కాపీని ఏకాగ్రతతో పూర్తిగా చదివి పక్కన పెట్టేశారు. అంతకు ముందు నందినగర్‌లోని ఇంటి నుంచి కెసిఆర్ అసెంబ్లీకి ఉదయం పది గంటలకే చేరుకున్నారు. దీంతో ఆయన ఆరు నెలల తర్వాత సభలో అడుగు పెట్టినట్టు అయింది. అసెంబ్లీలోకి వెళ్లే ప్రధాన ద్వారం వద్ద మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్, కవిత, ఇతర బిఆర్ఎస్ సభ్యులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సాదరంగా ఆహ్వానించారు. లోనికెళ్లాక తన చాంబర్‌లో కెసిఆర్ కూర్చున్నారు. అక్కడ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సభలో ఎలా వ్యవహరించాలనే దానిపై దిశానిర్దేశం చేశారు.

గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ వ్యాఖ్యలు శోచనీయం

- ఆ విగ్రహాలను టచ్ చేసి చూడండి..
- ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ ప్రసంగంపై ఎమ్మెల్యే కెటిఆర్ వ్యాఖ్యలు శోచనీయమని, కెటిఆర్ చిన్నపిల్లాడిలా ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని, ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, రామచంద్రు నాయక్, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి గవర్నర్ తమిళిసైని అవమానపరిచే విధంగా కెసిఆర్ వ్యవహరించారని, తండ్రీకొడుకులకు ఆ వ్యవస్థను అవమానపర్చడం అలవాటుగా మారిందని అన్నారు. గవర్నర్‌కు కెటిఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. తెలంగాణ తల్లి, రాజీవ్ గాంధీ విగ్రహాలను టచ్ చేసి చూడండి కేటీఆర్.. కాంగ్రెస్ కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్ దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, ఫాంహౌస్‌లో పడుకుంటే అభివృద్ధి ఎలా కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగంలో ఆసాంతం కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు అందుతున్న సంక్షేమ ఫలాలను ప్రతిబింబించాయన్నారు. చారిత్రాత్మక కుల సర్వేలో పాల్గొననని కేటీఆర్‌కు సర్వేపై మాట్లాడే అర్హత లేదన్నారు.

అది కాంగ్రెస్ ప్రెస్‌మీట్‌లా ఉంది

- కొత్త విషయాలేమీ లేవు.. అన్నీ అబద్ధాలే
- గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ వ్యాఖ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ ప్రసంగంలో కొత్త విషయాలేమీ లేవని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో ప్రజలకిచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీల ప్రస్తావన లేదని తెలిపారు. గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్ మీట్‌లా గవర్నర్ ప్రసంగముందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయనీ, రైతాంగం ఆందోళనలో ఉందని చెప్పారు. 480 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారనీ, వారికి భరోసా ఇచ్చే మాట ఆ ప్రసంగంలో లేకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో 25 శాతం నుంచి 35 శాతానికి మించి రైతు రుణమాఫీ కాలేదని చెప్పారు. రుణమాఫీ అయినట్టు ఆ ప్రసంగంలో చెప్పడం ద్వారా గవర్నర్ స్థాయిని దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ పాలన కాలంలో ఉన్న రైతు బంధు ఆపేసి అబద్ధాలు చెప్పారని విమర్శించారు. కెసిఆర్ మీద ద్వేషంతో మేడిగడ్డను రిపేర్ చేయకపోవటంతో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. చేతగాని రేవంత్ రెడ్డి పాలనలో రైతులు నీళ్లు లేక అవస్థలు పడుతున్నారని విమర్శించారు. సాగు నీటి సంక్షోభం, రైతుల ఇబ్బందుల ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర సచివాలయంలో 20శాతం కమీషన్ లేనిదే బిల్లులు రావడంలేదని చెప్పారు. వీరికి విజన్ లేదు, మన్ను లేదు, ఓన్లీ 20 శాతం కమిషనేనని ఎద్దేవా చేశారు. గురుకులాల్లో అధ్వాన పరిస్థితి నెలకొందని వాపోయారు. దీని గురించి గవర్నర్ ప్రసంగంలో ఒక్క మాట లేదన్నారు. పదేండ్ల పాలనలో రూ. 4.17 లక్షల కోట్ల అప్పులు చేశారంటూ కెసిఆర్ ప్రభుత్వంపై ఎగిసిపడ్డారు కదా? మరి కాంగ్రెస్ సర్కార్ ఒకే ఏడాదిలో రూ. 1.62 లక్షల కోట్ల అప్పు చేయటాన్ని ఏమనాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలన వల్ల వరి ధాన్యం ఉత్పత్తి పెరిగిందని అబద్ధాలు చెపుతున్నారన్నారు. కుంభకోణాలు, 30 శాతం ల్యాండ్ డీలింగ్‌లు, కాంట్రాక్టర్ల నుండి 20శాతం కమీషన్లు దండుకోవటంలో అధికార పార్టీ నేతలు బిజీగా ఉన్నారని విమర్శించారు. పదవులు కాపాడుకోవటానికి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని ఆరోపించారు. స్వయంగా కాంగ్రెస్ పార్టీ నాయకులే కమీషన్లు లేకుండా తమ నాయకులు పని చేయట్లేదని చెపుతున్నారని విమర్శించారు. దావోస్ నుంచి గతంలో చేసుకున్న ఒప్పందాలకు సంబంధించి శ్వేత పత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నారా? అని సీఎంను ప్రశ్నించారు. స్వచ్ఛ బయో కంపెనీలో సీఎం సోదరుడు పెట్టుబడి పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగమంతా పచ్చి అబద్ధం. మోసమనీ, ఇది ఆయన్ను కూడా మోసం చేయడమేనని తెలిపారు. బిసి కుల గణనను ప్రశ్నించిన ఒక ఎమ్మెల్సీని కాంగ్రెస్ పార్టీ తొలగించిందని కెటిఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ తల్లిని సెక్రటరియట్‌లో, రాహుల్ తండ్రి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు పెట్టారనీ, వాటిని రెండేళ్ల తర్వాత ప్యాక్ చేసి గాంధీ భవన్ పంపుతామని చెప్పారు.

యుకెజి విద్యార్థిపై స్కేల్‌తో టీచర్ దాడి

- ప్రశ్నించిన తల్లిదండ్రులను కులం పేరుతో దూషణ
- బోడుప్పల్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో యూకేజీ విద్యార్థి బి.ఇషాన్ భార్గవ్ వీపుపై టీచర్ స్కేల్‌తో కొట్టడంతో అతనికి గాయమైంది. బాలుడు ఇంటికి వెళ్లిన అనంతరం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్కూల్ ప్రిన్సిపల్‌ను నిలదీశారు. అయితే జరిగిన విషయంపై చింతించాల్సిన ప్రిన్సిపల్ రాజేందర్.. కులం పేరుతో తమను దూషించాడని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. అంతేకాకుండా విద్యార్థి తండ్రి బొమ్మకు శ్రీశైలం కూడా అదే విద్యాసంస్థ (వేరే బ్రాంచ్)లో పని చేస్తుండడంతో అతన్ని ఇబ్బందులు పెట్టాలని ఆ బ్రాంచ్ హెడ్‌కు చెప్పాడని వారు తెలిపారు. దాంతో చేసేదేమీ లేక బాధితులు మీడియాను ఆశ్రయించారు.

ప్రిన్సిపల్ వైఖరిని ఖండించిన విద్యార్థి, దళిత సంఘాలు

విద్యార్థులను కొట్టొద్దనే నిబంధనను పక్కన పెట్టి ఇలా దాడులు చేయడం ఏంటని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అర్.సంతోష్ రాథోడ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ ప్రశ్నించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌పై అనేక సార్లు ఫిర్యాదులు వచ్చినా అతనిలో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు.

పాఠశాల ఎదుట ఆందోళనకు దిగిన విద్యార్థి బంధువులు

పాఠశాలలో ఎలాంటి మౌలిక సదుపాయాలూ లేవని తెలిపారు. కనీసం గ్రౌండ్ సౌకర్యం కూడా లేదని, వందలాది మంది విద్యార్థులకు సరిపడా బాత్‌రూమ్‌లు లేవని అన్నారు. ఇన్ని ఇబ్బందులున్నా విద్యా శాఖ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. టీచర్ కొట్టడంపై తల్లిదండ్రులు అడిగితే కులం పేరుతో దూషించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మైసగళ్ల శివ డిమాండ్ చేశారు.

ఏప్రిల్‌లో ఎల్ఇడి ఎక్స్‌పో

ముంబయి : లైటింగ్ రంగంలో ఆటోమేషన్, ఇంధన పొదుపు, వినూత్న కల్పనలపై వచ్చే నెలలో ఎల్ఇడి ఎక్స్‌పోను నిర్వహించనున్నట్లు ఫ్రాంక్‌ఫర్ట్ ట్రేడ్ ఫెయిర్స్ ఇండియా తెలిపింది. ఏప్రిల్ 3-5 తేదిల్లో ముంబయిలో దీన్ని ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొంది. ఇందులో 200 మంది ఎగ్జిబిటర్లు తమ 6000 పైగా వినూత్న ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని వెల్లడించింది.

గురుప్రీత్ సింగ్ కుటుంబానికి పరిహారం చెల్లింపు

హైదరాబాద్ బ్యూరో : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన మిషన్ ఆపరేటర్ గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని పంజాబ్‌లోని అతడి స్వగ్రామానికి తరలించి, భార్య రజ్వీందర్ కౌర్‌కు అప్పగించినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను కుటుంబ సభ్యులను అందజేసినట్టు వివరించారు.

79 శాతం తగ్గిన ఎంఎఫ్ పెట్టుబడులు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది జనవరితో పోల్చితే గడిచిన ఫిబ్రవరిలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల్లో ఏకంగా 79 శాతం పతనం చోటు చేసుకుంది. ఈక్విటీ ఎంఎఫ్‌లు 26 శాతం తగ్గి రూ.29,303 కోట్లకు పరిమితమయ్యాయి. జనవరిలో ఈ మొత్తం రూ.39,687 కోట్లుగా నమోదయ్యిందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎంఎఫ్ఐ) వెల్లడించింది. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో జనవరిలో అత్యధికంగా రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు నమోదు కాగా.. ఫిబ్రవరిలో రూ.6,525 కోట్ల మేర పెట్టుబడులు తరలిపోయాయి. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు 35 శాతం తగ్గాయి. జనవరిలో రూ.5,720 కోట్లుగా ఉన్న ఈ మొత్తం ఫిబ్రవరిలో రూ.3,722 కోట్లకు చేరింది. మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోనూ 34 శాతం క్షీణతతో రూ.3,406 కోట్లకు తగ్గాయి. ఇంతక్రితం నెలలో రూ.5,147 కోట్ల పెట్టుబడులు చోటు చేసుకున్నాయి. మ్యూచుఫల్ ఫండ్స్ ఇండస్ట్రీ పరిధిలో ఉన్న నికర ఆస్తుల నిర్వహణ 4 శాతం క్షీణించి రూ.64.26 లక్షల కోట్లకు చేరింది. గడిచిన ఫిబ్రవరి సిప్‌ల్లోనూ పెట్టుబడులు 2 శాతం తగ్గి రూ.26,400 కోట్లుగా చోటు చేసుకున్నాయి.

స్పేస్‌ఎక్స్‌తో రిలయన్స్ జియో ఒప్పందం

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిలయన్స్ జియో ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. భారతీ ఎయిర్‌టెల్ బాటలోనే జియో కూడా భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించడానికి వీలుగా స్టార్‌లింక్‌లో భాగస్వామ్యమయ్యింది. ఈ ఒప్పందంతో దేశంలో హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవల్ని అందివ్వనున్నట్లు రిలయన్స్ జియో సిఇఒ మాథ్యూ ఒమన్ ఓ ప్రకటనలో తెలిపారు. జియో సంస్థ తన రిటేల్ ఔట్‌లెట్ల ద్వారా స్టార్‌లింక్ పరికరాలను అందించనుందన్నారు

ఫుడ్ డెలివరీ విభాగంలోకి ర్యాపిడో..!

హైదరాబాద్ : ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో ఫుడ్ డెలివరీ విభాగంలోకి రావడానికి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఈ రంగంలో పాతుకుపోయిన స్విగ్గీ, జొమాటోలకు పోటీని ఇవ్వాలని భావిస్తోంది. ఇందుకోసం పలు రెస్టారెంట్ సంస్థలతో ర్యాపిడో చర్చలు జరుపుతుందని సమాచారం. ప్రస్తుతం ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లలో అమలుచేస్తున్న కమిషన్ విధానాన్ని సవాలు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తోందని తెలుస్తోంది.

సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ బుక్ 5సిరీస్ పిసిలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా ఎఐ ఆధారిత గెలాక్సీ బుక్5 సిరీస్ పర్సనల్ కంప్యూటర్లను విడుదల చేసింది.

గెలాక్సీ బుక్5 ప్రో, బుక్ ప్రో 360, బుక్5 360 మోడళ్లను ఆవిష్కరించింది. గెలాక్సీ ఎఐ సహా మైక్రోసాఫ్ట్ కాపిలోట్ ప్లస్ పిసి అనుభవం, ఇంటెల్ కోర్ అల్ట్రా సిరీస్ 2 ప్రాసెసర్‌తో వీటిని అభివృద్ధి చేసింది. వీటి ప్రారంభ ధరలను రూ.1,14,990గా నిర్ణయించింది.

మిత్సుబిషి కోసం ఆజాద్ ఇంజనీరింగ్ యూనిట్

హైదరాబాద్ : మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ కోసం ప్రత్యేకంగా లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ప్రారంభించినట్లు ఆజాద్ ఇంజనీరింగ్ తెలిపింది. హైదరాబాద్‌లోని తునికొల్లారంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యూ లీన్ తయారీ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎంహెచ్ఐ ఎనర్జీ సిస్టమ్ జిటిసిసి బిజినెస్ డివిజన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మసాహిటో కటావోకా, తెలంగాణ పరిశ్రమలు, ఐటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఆజాద్ ఇంజనీరింగ్ చైర్మన్, సిఇఒ రాకేష్ చోప్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్ఐతో ఆజాద్ ఇంజనీరింగ్ దశాబ్దకాల భాగస్వామ్యంలో ఈ లీన్ మాన్యుఫాక్చరింగ్ ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుందని రాకేష్ చోప్దార్ పేర్కొన్నారు. 2024 నవంబర్ 3న ఆజాద్ జపాన్‌లోని మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌తో దీర్ఘకాలిక కాంట్రాక్ట్, ప్రైస్ అగ్రిమెంట్ (ఎల్టిసిపిఎ)పై సంతకం చేసిన తర్వాత ఈ పరిణామం జరిగింది.